క్లుప్తంగా

మల్లన్న జాతరలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఇంద్రేశం గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహా, కార్పొరేటర్ పుష్పా నగేష్, వార్డు సభ్యులు బండి శంకర్ పాల్గొన్నారు.

బెల్లాపూర్‌లో కంటి వెలుగు



కంటివెలుగులో పాల్గొన్న అధికారులు

మనూరు(నారాయణఖేడ్): బెల్లాపూర్‌లో మంగళవారం కంటి వెలుగును ప్రారంభించినట్లు ఎంపీడీఓ షాజిలోద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైద్యాధికారి రవి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్ తదితరులు

రాయికోడ్(అందోల్): జంబ్గికి చెందిన డి.అప్పర్ అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు టి.శ్రీకాంత్ మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రత్నారెడ్డి, నాగభూషణం, విఠల్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



లేగ దూడలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి అజింక్యా అన్నారు. మంగళవారం ఖలీల్‌పూర్, మెటల్‌కుంట, వడ్డి గ్రామాల్లో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ 4 నుంచి 8 నెలల లేగ దూడలకు బ్రుసెల్లోసీస్ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజయ్య పాల్గొన్నారు.

కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కురుమ సంఘం జిల్లా యువ అధ్యక్షుడిగా క్యాసారం ప్రవీణ్ కుమార్‌ను నియమించినట్లు కురుమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యెగ్గె మల్లేశం కురుమ, బండారి నారాయణ తెలిపారు. మంగళవారం కురుమ సంఘం సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బరుగడ్డ పుష్ప నాగేశ్, ఉపాధ్యక్షుడు తాటిపల్లి పాండు, పెద్దలు కల్వాగడ్డ మల్లయ్య, బీరయ్య, నాగేశ్, పైతరి సాయికుమార్, రామ్ చందర్, సత్య నారాయణ, శ్రీశైలం, పెద్దగొల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



కర్మాగారం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

జహీరాబాద్: పీఎఫ్, ఎల్ఐసీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ట్రైడెంట్ చక్కెర కర్మాగార కార్మికులు ధర్నా నిర్వహించారు. మంగళవారం కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ కర్మాగారం ప్రధాన గేటు ఎదుట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎంజి రాములుతో కలిసి ఆందోళన చేశారు.

'మన బడి'లో సకల సౌకర్యాలు

- జిల్లాకు మంజూరైన 441 పాఠశాలల్లో 57 పూర్తి
- నేడు మెటల్‌కుంటలో మూడు ప్రారంభం



ముస్తాబైన పాఠశాల

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే ప్రజల్లో ఒకరకమైన అభిప్రాయం ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది. ఆంగ్ల విద్యాబోధనతో పాటు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తుంది. అందులో భాగంగానే ప్రభుత్వం ×మన ఊరు–మన బడి॥ ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. మొదటి విడతగా జిల్లాలోని 441 పాఠశాలలను ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించేందుకు రూ.210 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో 441 పాఠశాలల్లో గదుల నిర్మాణం, ప్రహరీ, తాగు నీటి సౌకర్యం, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, డిజిటల్ తరగతుల బోధనకు అవసరమైన సామాగ్రి, విద్యుత్ సౌకర్యం వంటి ఏర్పాట్లకు పనులను ప్రారంభించింది. ఇప్పటి వరకు 57 పాఠశాలల్లో దాదాపు పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు ఆంగ్ల మాధ్యమం బోధనను ప్రవేశ పెట్టడంతో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. నేడు అధిక శాతం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. అందులోనూ ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడంతో విద్యార్థులు, వారి తల్లిండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెటల్‌కుంటలో3 పాఠశాలలు ప్రారంభం

'మన ఊరు–మన బడి' కింద మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆయ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.85లక్షలు కేటాయించింది. ఆ నిధులతో గదుల నిర్మాణం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యం, ప్రహరీ ఏర్పాటు, డిజిటల్ తరగతులు, విద్యుత్ సౌకర్యం తదితర పనులు పూర్తయ్యాయి. పాఠశాలలకు రంగులు వేయించి ముస్తాబ్ చేశారు. వీటిని బుధవారం కలెక్టర్ డాక్టర్ శరత్, జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ప్రారంభించనున్నారు.

పేద విద్యార్థులకు మేలు



గ్రామంలోని మూడు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం వల్ల పేద విద్యార్థులకు మేలు చేకూరనుంది. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన విద్యతో పాటు మంచి సౌకర్యాలు లభించనుంది. 1నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధించడం వల్ల విద్యార్థులకు ప్రయోజం కలుగుతుంది.

పీటర్‌రాజు, సర్పంచ్, మెటల్‌కుంట

57 పాఠశాలల్లో పనులు పూర్తి



మన ఊరు–మన బడి కింద జిల్లాలో 441 పాఠశాలలు ఎంపిక య్యాయి. వాటిలో ఇప్పటి వరకు 57 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి.

నాంపల్లి రాజేష్, డీఈఓ, సంగారెడ్డి

నేటి నుంచి తాత్కాలికంగా రైల్వే గేటు మూసివేత

- ఫిబ్రవరి 25వరకు రాక పోకల నిలిపి వేత
- బ్రిడ్జి నిర్మాణ పనుల కోసమే మూత



65వ జాతీయ రహదారిపై మూసివేయనున్న రైల్వే గేటు ఇదే

జహీరాబాద్: జహీరాబాద్ నుంచి ముంబాయి వెళ్లే 65వ జాతీయ రహదారి రైల్వే గేటు ఫిబ్రవరి1 నుంచి మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా సర్వీస్ రోడ్డు, సీసీ పిల్లర్ల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. జహీరాబాద్ నుంచి ఈద్గా ప్రాంతం మీదుగా పాత చెక్‌పోస్టు వైపు వెళ్లాలనుకునే వారు సంఘమిత్ర పాఠశాల రోడ్డు నుంచి అల్గోల్ క్రాస్‌రోడ్డు, బైపాస్ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలని సూచించారు. చెక్‌పోస్టు వైపు నుంచి జహీరాబాద్ పట్టణంలోకి వచ్చే వారు సైతం ఇదే మార్గం గుండా రాక పోకలు సాగించాలని అధికారులు సూచించారు. మొగుడంపల్లి రహదారి మీదుగా వెళ్లే వారు రాంనగర్ నుంచి చిన్న హైదరాబాద్ మీదుగా రాక పోకలు సాగించొచ్చు.

రైతులపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



రైతులతో కలసి భూములను పరిశీలించిన సీపీఎం నాయకులు

పటాన్‌చెరు టౌన్: పేద రైతులపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్డారం గ్రామంలో 747 సర్వే నెంబర్లో పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను గ్రామ రైతులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....50 సంవత్సరాల కిందట ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూముల్లో రైతులు సాగు చేసుకుంటున్నారు. అప్పటినుంచి ఇదే వారి జీవనాధారంగా ఉందన్నారు. అలాంటి భూముల్లో వేణుగోపాల రావు అనే వ్యాపారి రైతులను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, కృష్ణ, రైతులు మొగులయ్య, ఆంజనేయులు, జోగయ్య, మాలయ్య, వెంకటయ్య, అనిల్, వెంకటేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యమని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతి నగర్ కాలనీలో బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజాసేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమేనని, ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవే చిరకాలం నిలిచి పోతాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో నరేందర్ ఉద్యోగ విరమణకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో నరేందర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ జీతాలతో పాటు బీఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ అన్ని ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించారు. కానీ జహీరాబాద్ డివిజన్ పరిధిలో డిసెంబర్ జీతాలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో బీఎల్ఓ డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. బీఎల్ఓ డ్యూటీలు ఇబ్బందికరంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు శోభ, విజయలక్ష్మి, పద్మ, జగదాంబ, నాగమణి, వసీమ, గౌరమ్మ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్గి మీదుగా బీదర్‌కు బస్సు నడపాలి

నారాయణఖేడ్: ఖేడ్ నుంచి మోర్గి మీదుగా బీదర్‌కు బస్సు నడపాలని మోర్గి ఎంపీటీసీ నందుపటేల్‌తో పాటు అదే గ్రామానికి చెందిన వెంకట్‌లు కోరారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. నాగ్‌ధర్, కల్హేర్‌ల మీదుగా నిజాంసాగర్‌కు, సంగమేశ్వర్, దుదగొండ, బోరం, కంకోల్ మీదుగా పటాన్‌చెరుకు బస్సు నడపాలని దుదొండ సర్పంచ్ రాజుతోపాటు కృష్ణ, వీరేశం సూచించారు. బోరంచకు సమయానుకూలంగా బస్సులు నడపాలని పలువురు విద్యార్థులు కోరారు. డీఎం మల్లేశయ్య ఆయా సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

సద్వినియోగం చేసుకోండి: డీఎం మల్లేశయ్య



డీఎం మల్లేశయ్య

శుభకార్యాలు, విందులు, వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవాలని డీఎం మల్లేశయ్య కోరారు. బస్సుల బుకింగ్ కోసం ప్రవీణ్ కుమర్ 9494093486, పాండు 9441071134, రాధాకృష్ణ 9949939489 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐటీ పరికరాలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ దుబే

నర్సాపూర్ రూరల్: బీవీఆర్‌ఐటీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐటీ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీవీఆర్‌ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే మాట్లాడుతూ.. బీవీఆర్‌ఐటీ కళాశాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి బీవీఆర్‌ఐటీ కళాశాలకు ఐటీ ప్రాజెక్టు మంజూరు అయిందన్నారు. నిత్య జీవితంలో ఇంటర్నెట్ ఉపయోగంపై ఐటీపై విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, సర్టిఫికేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపిరాజు, అశోక్ రెడ్డి, కళాశాల అధ్యాపక బందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పూజలో ఎమ్మెల్యే



తుల్జాపూర్‌లో అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద ఎమ్మెల్యే తదితరులు

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పండరీపూర్‌లో నిర్వహిస్తున్న మాఘమాస ఉత్సవాలతోపాటు బుధవారం నిర్వహించనున్న కరణ్ గజేంద్రభారతి మహారాజ్ ఆశ్రమం, ధర్మసత్రం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రాంసింగ్, పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, రైబస అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, కృష్ణాపూర్ సర్పంచ్ కృష్ణారెడ్డి సోమవారం వెళ్లారు.

కొనసాగుతున్న ఆదినారాయణ స్వామి ఉత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): కొడకంచి గ్రామంలోని ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. దేవాలయ ట్రస్టీ చైర్మన్ రామాజీరావు ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

కంటివెలుగుకు స్పందన



ఖేడ్ బస్తీ దవాఖానాలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలు

నారాయణఖేడ్: ఖేడ్‌లో కంటి వెలుగుకు మంచి స్పందన లభిస్తోంది. రెండో వార్డుకు సంబంధించి శిబిరాన్ని బస్తీదవాఖానాలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరం 3వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. నిజాంపేట్ పీహెచ్‌సీ వైద్యులు డా.రాహుల్ చౌహాన్, డా.అఖిల, జెట్ల భాస్కర్, సంతోషమ్మ, వినోద, శోభారాణి, పాపమ్మ, సునీత, సమీయొద్దీన్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

జహీరాబాద్: రోటరీ క్లబ్ ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం రాత్రి సిద్ధి హోటల్‌లో రొటేరియన్ బెజుగం రాజయ్య ఆధ్వ ర్యంలో నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎలక్టెడ్ అసిస్టెంట్ గవర్నర్ పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ తరఫున ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి లాల్‌రెడ్డి, సభ్యులు వెంకటేశం, బి.రాజయ్య, సంగమేశ్వర్, సంగ్రామ్‌పాటిల్, ఎంపి.వెంకట్‌రెడ్డి, నరోత్తం, జయసింహారెడ్డి, చంద్రశేఖర్, శేషు, సీతారామరాజు, వివి.రెడ్డి, కల్వ మోహన్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మహా పడిపూజ



సదాశివపేటలో పడిపూజ దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): శ్రీకాశిక హనుమాన్ మందిరంలో గురుస్వామి బస్వరాజ్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ శివమహాపడిపూజ మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 12 జ్యోతిర్లింగ మహాపడిపూజ శివగురుస్వామి రమేష్ దంపతులు 12 లింగాల అభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమహాపడిపూజకు మీనంపల్లి శంకరయ్యస్వామి హాజరయ్యారు. దుర్గాభవాని భజన మండలి, సంగారెడ్డి బృందం ఆటపాటలతో భక్తులను ఆకట్టుకున్నారు. గురుస్వామి రమేష్‌సాగర్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ ఆకుల శివకుమార్, శివగురుస్వాములు చెన్‌బసప్ప, ఉమాకాంత్, సుక్కస్వామి, అశోక్‌స్వామి, కొండల్, సతీష్, విశ్వనాథం, గణేష్, బత్తిని శేఖర్, రాజు, మధు, శంకరయ్య, బాలుస్వాములు భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల వినతి



ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జోగిపేట(అందోల్): 3నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంగళవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు వేడుకున్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల గురించి శాసనసభలో మాట్లాడాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు అరుణ, ఇందిర, శోభారాణి, జ్యోతి, రమకల, పద్మ పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి



పాఠశాల సిబ్బందితో జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలను జాయింట్ డైరెక్టర్ పి.సరోజినీ దేవి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. అందుకు తగ్గట్టుగా కష్టపడి ఇష్టంతో చదవాలని విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు చెప్పాలన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ**

నారాయణఖేడ్: పట్టణంలోని పాత ఐకేపీ కార్యాలయ భవనంలో కంప్యూటర్ కోర్సు రెండో బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జైపాల్ తెలిపారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులు, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7036255867 నెంబరులో సంప్రదించాలని కోరారు.

◆ **గ్యాస్ వాడకంపై అవగాహన**

న్యాల్‌కల్(జహీరాబాద్): ముంగి, హద్నూర్, రుక్మాపూర్, న్యాల్‌కల్ గ్రామాల్లో గ్యాస్ వాడకంపై అవగాహన నిర్వహించారు. శ్రీగురు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బంది కుమార్, నాగరాజు వివరించారు.

◆ **దేవాలయ నిర్మాణంపై చర్చ**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మించనున్న జ్యోతిర్లింగ శివాలయంపై శివస్వాములు, గ్రామ పెద్దలు మంగళవారం చర్చించారు. శివాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామస్తులు కోరారు.

◆ **సిర్గాపూర్ మండల బీజేవైఎం కార్యవర్గం ఎన్నిక**

నారాయణఖేడ్: సిర్గాపూర్ బీజేవైఎం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంపీటీసీ బి.పీరయ్య, ఉపాధ్యక్షుడిగా గొల్ల పెంటయ్య, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా కుమ్మరి అశోక్, కుమ్మరి బాలన్న, సహాయ కార్యదర్శులుగా చింతల కుమార్, అశోక్ ముదిరాజ్, కోశాధికారిగా జువ్వ ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రాజు, నర్సాగౌడ్, ప్రభాకర్, రాందాస్, విక్రం, భీమయ్య ఎన్నికయ్యారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ షెట్కార్, ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రవి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మఠం శివకుమార్ ధృవపత్రాలను అందజేశారు.

◆ **'పేదలకు రేషన్ కార్డులు అందజేయాలి'**

కంది(సంగారెడ్డి): అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలని సీపీఐ మండల నాయకులు ఎంఎ ఖాజా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ కార్డులకోసం దరఖాస్తులు చేసుకుని ఏండ్లు గడుస్తున్నా మంజూరు కావడం లేదని వారు ఆరోపించారు. దీంతో అర్హులైన పేదలు డబ్బులు చెల్లించి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందజేయాలని వారు కోరారు.

◆ **రాజశ్యామల యాగం**

మునిపల్లి(అందోల్): రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలలో భాగంగా యాగం, గోపూజ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, సుగుణ దంపతులు నిర్వహించారు. బర్దిపూర్ దత్తాత్రేయ ఆశ్రమంలో నిర్వహించినట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు.

◆ **ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

జహీరాబాద్ టౌన్: ఆన్‌లైన్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, ఆన్‌లైన్ మోసాల నివారణకు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. షీటీంకు 100ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అస్లాం ఫారూకి, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **సోలక్‌పల్లిలో బోరు**

జిన్నారం(పటాన్‌చెరు): సోలక్‌పల్లిలోని క్రీడాప్రాంగణంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీపీ రవీందర్‌గౌడ్ సొంత నిధులతో మంగళవారం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా శివపడిపూజ**

జిన్నారం(పటాన్‌చెరు): వావిలాల గ్రామంలో శివపడిపూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, ఎంపీపీ రవీందర్‌గౌడ్‌లు హాజరయ్యారు. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని కాటా సుధా ఆకాంక్షించారు.

◆ **ఆల్‌ఇన్‌వన్ పుస్తకాల అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): కానుకుంటలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు బీజేపీ నాయకులు ఎడ్ల రమేశ్ మంగళవారం ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను అందించారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు.